క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

లింగాపూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు ఎస్సై కొట్టే ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇసుక రవాణాకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ ఎదుట బైండోవర్ చేశారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఉపాధ్యాయులు టీచర్‌డైరీలు రాయాలి



ఎండీఎంను పరిశీలిస్తున్న ప్రకాశ్

కెరమెరి: ఉపాధ్యాయులు టీచర్‌డైరీలు రాయాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోయగాం, ధనోరా, ఝరి, సాంగ్వి ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ప్రతీ విద్యార్థికి పెన్ నంబర్ ఉండాలని, దాన్ని రిజిస్టర్లలో నమోదు చేయాలని పేర్కొన్నారు. చతుర్విధ ప్రక్రియలు బోధించాలని, మెనూ పాటించాలన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. రూ.5 లక్షల నిధులతో స్థానిక బెస్తకాలనీలో సీసీరోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. హనుమాన్ ఆలయ చైర్మన్ ఎల్ములే దత్తు, నాయకులు చంపత్, భరత్, తిరుపతి, నానాజీ భావుజీ, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ అడుగుజాడల్లో నడవాలి



భూమిపూజ చేస్తున్న నాయకులు

కౌటాల: ఆదర్శనీయుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అడుగుజాడల్లో ఆరె కులస్తులు నడవాలని ఆరె సంఘం మండల అధ్యక్షుడు ధునుర్కార్ వసంత్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆరె సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు దుబ్బుల నానయ్య, గౌరవ అధ్యక్షుడు వానుపటేల్, మాజీ సర్పంచ్ చరందాస్, మండల నాయకులు నాగపురే బండు, మధుకర్, చందు, సంతోష్, శంకర్, ప్రభాకర్, వసంత్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

6న సర్వసభ్య సమావేశం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 6న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.సత్యనారాయణ తెలిపారు. ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని, వివిధ శాఖల అధికారులు తమ నివేదికలతో తప్పక హాజరుకావాలన్నారు.

అర్చకుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: గత అక్టోబర్‌లో జిల్లాలో డీడీఎస్ పథకం కింద ఎంపికైన అర్చకులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు శిరీష్‌శర్మ, జిల్లా బాధ్యులు సత్యనారాయణశర్మలు కోరారు. పెండింగ్ వేతనాలను త్వరగా విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అసిస్టెంట్ కమిషనర్ నవీన్‌కుమార్‌కు తన కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ నూతనంగా, గతంలో నియామకమైన అర్చకులకు ఆర్డర్ కాపీలు అందజేయాలని కోరారు. వేతనాలు రాక అర్చకులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అర్చకులకు రావాల్సిన పెండింగ్ వేతనాలు త్వరగా విడుదలయ్యేలా చూడాలని కోరారు. వీరితో పాటు వెంకటేశ్వర్లు ఉన్నారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు..!

- పేరుకుపోయిన చెత్తాచెదారం
- రోడ్లపైనే పారుతున్న మురుగునీరు
- అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు కరువు
- పట్టించుకోని అధికారులు



మురుగు కాలువ లేక రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



అపరిశుభ్రంగా ఉన్న మురుగు కాలువ

లింగాపూర్: మండల కేంద్రంలోని పలు కాలనీలతో పాటు ఆయా గ్రామాల్లోని డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారాయి. సిబ్బంది మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో మండలవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, చెత్తా చెదారం పేరుకుపోవడంతో నీరు ఒకేచోట నిల్వ ఉంటోంది. ఫలితంగా మురుగునీరు రోడ్లపై పారుతోంది. దీంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది.

పారిశుధ్యం కరువు..

మండలంలోని పలు గ్రామాలతో పాటు కాలనీల్లో పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదు. మండలంలోని అంబేద్కర్‌నగర్, మాన్కుగూడ, పిట్టగూడ, నడ్డంగూడ, పిక్లాతండా, కొత్తపల్లి, దంపూర్, మొతిపటార్ తదితర గ్రామాలలో గతంలో నిర్మించిన ఓపెన్ మురుగు కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువల్లో చెత్తాచెదారం తొలగించకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది.

మురుగు కాలువలు లేక..

మండల కేంద్రంలోని గాంధీనగర్, పోచ్చమ్మనగర్‌లలో మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. దీంతో రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. ఇళ్ల మధ్య మురుగు చేరి దుర్వాసన వస్తుందని, దీంతో ఈ రోడ్లపై వెళ్లే ప్రయాణికులతో పాటు స్థానికులు అవస్థలు పడుతున్నారు. కాగా ఓపెన్ మురుగు కాలువల స్థానంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రెయినేజీ నిర్మించాలి



డ్రెయినేజీ లేక రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. కొత్త ప్రభుత్వం మా ప్రాంతంలో మురుగు కాలువలు నిర్మించాలి.

\- రాథోడ్ దేవిదాస్, పోచమ్మనగర్, లింగాపూర్

పూడిక తీయించాలి



మురుగుకాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో నీరు నిల్వ ఉంటుంది. అధికారులు స్పందించి డ్రెయినేజీల్లో పూడిక తీయించాలి.

\- మెస్రం గంగు పటేల్, గాంధీనగర్, లింగాపూర్

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి

- లక్ష్యం రూ.26.68 లక్షలు
- మార్చిలోపు వందశాతం టార్గెట్
- నేటి వరకు వసూలు రూ.23.70లక్షలు



మోతుగూడలో పన్ను వసూలు చేస్తున్న అధికారి

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరులు. మార్చిలోపు వంద శాతం ఇంటి పన్నుల వసూలే లక్ష్యంగా పంచాయతీ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికీ తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో 2023 -24 సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరేందుకు అధికారులు నిమగ్నమయ్యారు. గతంలో మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా, పునర్విభజనలో 26 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. మండల వ్యాప్తంగా 26 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే 88 శాతం పన్నులు వసూలు చేశారు. మొత్తం రూ.26 లక్షల 68 వేలు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.23లక్షల70 వేలు వసూలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన రూ.2 లక్షల 90 వేలు ఇంకా వసూలు చేయాల్సి ఉంది. మార్చి నెల చివరి వరకు 100శాతం పన్నులు వసూలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

వేగంగా వసూళ్లు..

డిసెంబర్ నుంచి పన్నుల వసూలుకు మండల వ్యాప్తంగా అధికారులు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉదయాన్నే గ్రామాలకు చేరుకొని ఇంటింటికీ తిరుగుతూ యజమానులు పన్నులు చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నారు. డీఎల్‌పీవో, ఎంపీవో ఆకస్మిక తనిఖీలు, సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ వంద శాతం పన్నులు వసూలయ్యేలా చర్యలు చేపట్టారు. సంబంధిత అధికారులు ఎంపీవో, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులకు మార్చి నెల చివరి వరకు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించడంతో పంచాయతీ కార్యదర్శులు ఉదయం తమ పరిధిలోని గ్రామాలలో తిరుగుతూ ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు.

13 పంచాయతీల్లో నూరు శాతం..

మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు గాను 88శాతంతో ఇప్పటివరకు 13 గ్రామ పంచాయతీల్లో 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేశారు. మోతుగూడ, అడ, అంకుసాపూర్, గోవింద్‌పూర్, కోసార, కౌటాల, మానిక్‌గూడ, మోవాడ్, రౌట సంకేపల్లి, సాలేగూడ, తుంపెల్లి, ఎల్లారం, వావుదాం గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలు చేశారు. మిగతా 13 గ్రామ పంచాయతీల్లో 70 నుంచి 80 శాతం వరకు వసూలు చేయగా మార్చి నెల చివరి లోపు అన్ని గ్రామపంచాయతీల్లో 100శాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు.

మార్చి చివరినాటికి పూర్తి చేస్తాం

ఇప్పటి వరకు మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేశాం. మిగితా 13 జీపీల్లో 70 శాతం వరకు పన్నులు వసూలయ్యాయి. మార్చి 20లోపు వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

\- మౌనిక, ఎంపీవో

ఉపాధి పనుల పరిశీలన



బావి మరమ్మతులు ప్రారంభిస్తున్న అధికారులు

కెరమెరి: మండలంలోని శివగూడ, లైన్‌పటార్ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం పనులను శుక్రవారం ఎంపీడీవో కృష్ణారావు పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. తాగేందుకు నీటి సౌకర్యం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని శివగూడ గ్రామస్తులు తెలుపగా, వెంటనే గ్రామసమీపంలోని బావి మరమ్మతు పనులు ప్రారంభించారు. అనంతరం లైన్‌పటార్‌లో పర్కులేషన్ ట్యాంకు పనులు ప్రారంభించారు. జాబ్ కార్డు ఉన్న వారందరికి పనులు కల్పిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, టీఏ నాగోరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ ఉన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలి



బ్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు సూచించారు. శుక్రవారం పట్టణంలోని చిలువేరు మార్గ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ కార్యాలయం, ఏటీఎంను ఆయన ప్రారంభించారు. కాగజ్‌నగర్ పట్టణంలో బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర శాఖను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు జోనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ గుప్తా, బ్యాంకు మేనేజర్ నగేశ్, వ్యాపారస్తులు చిలువేరు సత్యనారాయణ, రాచకొండ గిరీశ్, చిలువేరు గంగన్న, హన్మంతరావు, వెంకటరమణ, సురేశ్, ప్రవీణ్, శివ, అరుణ్‌లోయా, శివాగౌడ్, రాజు, దీపక్, తిరుపతి, హరీశ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ ముఠా సంచరిస్తున్నట్లు ప్రచారం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి గ్రామ పంచాయతీలోని సీబాపు కాలనీలో పిల్లలను కిడ్నాప్ చేసే ముఠా సంసంచరించినట్లు శుక్రవారం రాత్రి ప్రచారం జరిగింది. కాలనీకి చెందిన ఓ విద్యార్థి ట్యూషన్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఇద్దరు మహిళలు తనను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని, వెంటనే కేకలు వేయడంతో వారు పారిపోయినట్లు విద్యార్థి తల్లిదండ్రులకు తెలిపాడు. ఈ విషయం స్థానిక సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో కాగజ్‌నగర్ రూరల్ ఏఎస్సై మానుసీబాపు కాలనీలో తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ముఠా సభ్యులు సంచరించినట్లు ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బోగే ఉపేందర్

రెబ్బెన: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గోలేటిలోని కమ్యూనిటీ హాల్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భవన నిర్మాణంలో ప్రభుత్వం కడుతున్న 1 శాతం సెస్సును 2 శాతానికి పెంచాలన్నారు. 55ఏళ్లు పైబడిన భవన నిర్మాణ కార్మికులకు ప్రతి నెల రూ. 10వేల పెన్షన్ ఇవ్వాలని, కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులకు రాష్ట్రస్థాయి సలహా బోర్డులో సభ్యులుగా నియమించాలని, గతంలో పెండింగ్‌లో ఉన్న పెన్షన్లను ఇతర బెనిఫిట్ బకాయిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల అడ్డాల వద్ద అన్ని మౌలిక వసతులతో షెడ్లు నిర్మించాలన్నారు. పాత పద్ధతిలో భవన నిర్మాణ కార్మికులకు కార్డులు ఇవ్వాలని, అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్‌కార్డులు అందించాలన్నారు.

విజయ సంకల్పసభ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దహెగాం: ఆదిలాబాద్‌లో ఈనెల 4న చేపట్టే విజయ సంకల్పసభను జయప్రదం చేయాలని సహకార సంఘం చైర్మన్ కోండ్ర తిరుపతి గౌడ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్ర మోడి విజయ సంకల్ప సభకు వస్తున్నందున బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుల్గం నారాయణ, చప్పిడె సంజీవ్, సామెర మల్లేష్, పడాల సురేశ్, తుమ్మిడె సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి పర్యటన విజయవంతం చేయాలి

జైనూర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 4న జరిగే దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మండల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సైనికుల్లా పని చేయాలన్నారు. అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, పార్లమెంట్ కో కన్వీనర్ కొలిపాక కిరణ్, మండల అధ్యక్షుడు కోట్నాక దౌలత్‌రావు, నాయకులు ఆత్రం అర్జున్, మెస్రం న్యానేశ్వర్, రాథోడ్ ధర్మేందర్, జుగ్నక ధర్మేందర్‌ర, ఆత్రం ఈంరావ్, మెస్రం గోపాల్, నాయకులు తదితరులు ఉన్నారు.

రక్త నమూనాల సేకరణ



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో గురువారం రాత్రి బోదకాల వ్యాధిని గుర్తించేందుకు వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించారు. మలేరియా జిల్లా సూపర్‌వైజర్ అశోక్ మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి గ్రస్తులను ముందుగానే గుర్తించి వైద్యం అందిస్తే నయమవుతుందన్నారు. మైక్రో ఫైలేరియా క్రిమి ఉన్నట్లు గుర్తించిన వారికి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే ఫైలేరియా వ్యాధి బారిన పడిన బాధితులకు కిట్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మైక్రో ఫైలేరియా క్రిమి బాధితుల రక్తనాళాల్లో ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి 2 గంటల వరకు 300 మంది నుంచి రక్తం సేకరించినట్లు ఆయన తెలిపారు. హెచ్‌ఈవో సోనాజీ, వైద్య సిబ్బంది నర్సయ్య, శైలేందర్ సింగ్, లాల్ సింగ్, సవిత, సునిత, జాహి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న రాణి, రాజేశ్వరి

కెరమెరి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రాణి, రాజేశ్వరిలు అన్నారు. ఈ నెల 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కొఠారి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. భారతదేశంలో మహిళలకు ఉన్నతమైన స్థానం ఉందని, మహిళా గౌరవాన్ని కాపాడేందుకు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. సమాజంలో మహిళలపై జరిగే అణిచివేతను అధిగమించడానికి, నియంత్రించడానికి భారత రాజ్యాంగంలో చట్టాల ద్వారా హక్కులు కల్పించారన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను అమలవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్, సాగర్, శకుంతల, శ్రీనిధి, తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. 143 మంది విద్యార్థులు ఉండగా శుక్రవారం ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 135 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సీఎస్, ప్రిన్సిపాల్ అమరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా సిట్టింగ్ స్క్వాడ్ శ్యాంమూర్తి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి తిరుపతి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ, బీసీ సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని, నూతన ప్రభుత్వం విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, వైష్ణవి, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ పాదయాత్ర



మాట్లాడుతున్న సుదర్శన్

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామంలో శుక్రవారం పేదరిక నిర్మూలన పోరాట సమితి (పీఎన్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు గడపగడపకు పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు చదువుకొని ఉన్నత విద్యనభ్యసించాలన్నారు. విద్యతోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమని తల్లిదండ్రులు పిల్లలను గ్రామాలకు పరిమితం చేయకుండా పట్టణాలకు పంపించి ఉన్నత విద్యనభ్యసించేలా చూడాలన్నారు. అనంతరం పేదరిక నిర్మూలన అంశంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అజ్మీరా రాంనాయక్, నాయకులు చంద్రగిరి రవీందర్, టేకం హన్మంతు, నాగయ్య, రామయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ కార్యవర్గాలు ఎన్నిక

కాగజ్‌నగర్‌రూరల్: టీయూటీఎఫ్ పట్టణ, మండల కార్యవర్గాలను శుక్రవారం ఎన్నుకున్నారు. పట్టణంలోని పెట్రోల్‌పంపు ఉన్నత పాఠశాలలో మండల, పట్టణ శాఖల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కోడ్ రాకముందే సీపీఎస్‌పై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కాగజ్‌నగర్ పట్టణ, మండల శాఖల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కాగజ్‌నగర్ పట్టణ గౌరవ అధ్యక్షుడిగా శ్యాంరావు, అధ్యక్షుడిగా అనీస్ అహ్మద్, సహాధ్యక్షుడిగా సునీల్ కుమార్, సూర్య, ప్రధాన కార్యదర్శిగా కృష్ణాచంద్, సంయుక్త కార్యదర్శిగా పద్మావతి, సాయిరామని, ఫైనాన్స్ సెక్రటరీగా రాజేశ్వర్‌లు ఎన్నికయ్యారు. మండలశాఖ గౌరవ అధ్యక్షుడిగా దామోదర్, అధ్యక్షుడిగా భగవాన్, సహాధ్యక్షులుగా లక్ష్మినారాయణ, సుశీల, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మయ్య, సంయుక్త కార్యదర్శిగా అరుణ్‌కుమార్, లావణ్య శిల్ప, ఫైనాన్స్ సెక్రటరీగా సుకన్య, సింహాచలం, రవీందర్ రెడ్డిలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శాంతికుమార్, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా సహాధ్యక్షులు భానుప్రకాశ్, సవిత వ్యవహరించారు.

వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబు



విద్యుత్ కాంతుల్లో ఆలయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ శ్రీ కేశవనాథస్వామి ఆలయంలో శనివారం నిర్వహించే చతుర్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేవాదాయ, ధర్మాదాయశాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో వేణుగోపాల్‌గుప్తా , ఆలయ కమిటీ అధ్యక్షుడు వైరాగడె మనోజ్, అర్చకులు ఒజ్జల నరేష్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నేడు ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు నిత్యపూజా అభిషేకం, పుణ్యావచనం, 8 గంటలకు శ్రీదేవీ, భూదేవి సహిత కేశవనాథస్వామి పంచామృతాభిషేకం, అలంకరణం, మధ్యాహ్నం ప్రసాద వితరణ, రాత్రి స్వామివారి సన్నిధిలో భజనా కార్యక్రమం, మంగళహారతి, మహా మంత్ర పుష్పాన్ని నిర్వహించనున్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

ఓటుపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ఓటుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని హెచ్‌ఎం నారాయణ్‌సింగ్ అన్నారు. తెలంగాణ ఓటరు సంకల్పపత్రంలో భాగంగా శుక్రవారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓటు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం అర్హులైన వారు ఓటు వేయాలన్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో భయం, పక్షపాతం లేకుండా కులం, మతం, ప్రాంతం, భాషతో పాటు ఇతర ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని తల్లిదండ్రులకు సూచించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, శ్యాంరావు, సంతోష్, రాంచందర్, సత్యనారాయణ, కవిత, రజిత, బీఈడీ శిక్షకులు మానస, అశ్విని, ప్రీతి, మౌనిక, మహేశ్వరి, సోని, శరణ్య తదితరులు పాల్గొన్నారు.